ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ సంపుటి: 20 సంచిక : 239 గురువారం 30, ఏప్రిల్ 2026 పేజీలు: 04 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com

# రేవంత్ రెడ్డివి ఉత్తమాటలే


రైతు భరోసా నిధులు
ఎందుకు ఇస్తలేరు
బీఆర్ఎస్ వర్కింగ్
ప్రెసిడెంట్ కేటీఆర్
తెలంగాణ భవన్‌లో
బీఆర్ఎస్‌లో చేరికల కార్యక్రమం
కాంగ్రెస్ సర్కారుపై
కేటీఆర్ తీవ్ర విమర్శలు
రైతు బంధు
అమలుపై ప్రశ్నల వర్షం
యూరియా కొరతపై
ప్రభుత్వాన్ని నిలదీత
ఓటమి తర్వాత పార్టీ
పరిస్థితులపై వ్యాఖ్యలు
ఎమ్మెల్యేల మార్పులు,
ఎంపీ సీట్లపై అసంతృప్తి
ఎస్సీ, ఎస్టీల ఇళ్ల హామీలపై విమర్శ
ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల
నిలుపుదలపై ఆరోపణ
విద్యార్థులు, రైతులు ఇబ్బందులు
పడుతున్నారని వ్యాఖ్య



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
తెలంగాణలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కుతోంది. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల గురించి మాట్లాడటంలో మాత్రమే పరిమితమవుతున్నారని, అమలులో మాత్రం విఫలమవుతున్నారని ఆరోపించారు.

రైతు భరోసాపై ప్రశ్నలు
రైతులపై నిజంగా ప్రేమ ఉంటే 'రైతు భరోసా'ను వాయిదాలుగా ఎందుకు ఇస్తున్నారని కేటీఆర్ ప్రశ్నించారు. రైతులకు ఆర్థిక భరోసా కల్పించే పథకాలు ..మిగతా 2లో

# ఐదు రాష్ట్రాల్లో ఎగిరేది కాషాయ జెండానే



అసెంబ్లీ ఎన్నికలపై ప్రధాని మోదీ ధీమా
ఐదు రాష్ట్రాల్లోనూ క్లీన్ స్వీప్ దిశగా బీజేపీ
బెంగాల్‌లో ఓటింగ్ ప్రజాస్వామ్య విజయమన్న మోదీ
వికసిత్ భారత్ సంకల్పానికి ఎన్నికల ఫలితాలే ఊపిరని వెల్లడి
గుజరాత్, బిహార్ ఫలితాలే పునరావృతం కానున్నాయని వ్యాఖ్య
కాంగ్రెస్, సమాజ్ వాదీ మహిళా వ్యతిరేక పార్టీలని విమర్శలు
నారీ శక్తి బిల్లును అడ్డుకునేందుకు కుట్ర చేశారని ఆరోపణ
యూపీలో గంగా ఎక్స్‌ప్రెస్ వే పనులు ప్రారంభించిన మోదీ

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
దేశవ్యాప్తంగా ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ చారిత్రాత్మక విజయం సాధించబోతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. కేరళ, తమిళనాడు, అసోం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలోనూ ప్రజలు బిజెపిఎన్‌డీఏ కూటమికే పట్టం కట్టబోతున్నారని ఆయన స్పష్టం చేశారు. ఉత్తర్ ప్రదేశ్‌లోని హర్దోయ్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన 'గంగా ఎక్స్‌ప్రెస్ వే' పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని, ఈ సందర్భంగా నిర్వహించిన భారీ బహిరంగ సభలో ప్రసంగిస్తూ విపక్షాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశాభివృద్ధికి, మహిళా సాధికారతకు అడ్డుపడుతున్న పార్టీలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని మోదీ హెచ్చరించారు. మే 4న వెలువడనున్న ఫలితాలు దేశ రాజకీయాల్లో కొత్త అధ్యాయాన్ని లిఖిస్తాయని, 'వికసిత్ భారత్' సంకల్పాన్ని ఇవి మరింత బలోపేతం చేస్తాయని ఆయన పేర్కొన్నారు.
పశ్చిమ బెంగాల్‌లో జరిగిన రెండో దశ ఎన్నికల సరళిపై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో బెంగాల్ ఎన్నికలంటే హింస, ..మిగతా 2లో

# కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ బోగస్

ఎన్నికల్లో చెప్పిందొకటి..
చేస్తున్నది మరొకటి
రైతుల కష్టాలు ప్రభుత్వానికి పట్టవా?
కొనుగోళ్లు ఎందుకు మొదలుపెట్టలేదు?
బస్తాకు కిలో, రెండు కిలోల తరుగు
అన్నదాతలను దోచుకుంటున్న మిల్లర్లు
సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి
హరీశ్ రావు బహిరంగ లేఖ



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
'తరుగు పెడితే తోలు తీస్తామని' కాంగ్రెస్ ప్రభుత్వం హెచ్చరించిందని, కానీ తాలు, తరుగు పేరిట రైతులు దోపిడీకి గురవుతున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లులో దించేదాకా ..మిగతా 2లో

# అవసరానికి మించి పెట్రోల్, డీజిల్ కొంటున్నారు

వదంతులతో పెరిగిన
ఇంధన డిమాండ్
సరిహద్దు జిల్లాల్లో ప్రభావం తీవ్రం:
మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి
వదంతులతో అధికంగా
కొనుగోళ్లు చేస్తున్న ప్రజలు
బెంగాల్ ఎన్నికల తర్వాత ధరలు
పెరుగుతాయనే ప్రచారం
రాష్ట్రవ్యాప్తంగా
3,817 ట్యాంకర్లు పంపిణీ
24 గంటలూ పనిచేయాలని
ఆయిల్ కంపెనీలకు ఆదేశాలు
కలెక్టర్లతో జిల్లా
ఇంధన కమిటీలు ఏర్పాటు
ప్రతి నాలుగు గంటలకు
అవుట్‌లెట్ల వద్ద పర్యవేక్షణ
టోల్‌ఫ్రీ 1967కు
ఫిర్యాదులు ఇవ్వాలని సూచన






**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
తెలంగాణలో పెట్రోలియం ఉత్పత్తుల డిమాండ్ అకస్మాత్తుగా పెరగడం ఆందోళనకు గురిచేస్తోంది. ఈ పరిణామంపై స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్రంలో వదంతుల ప్రభావంతో ప్రజలు అవసరానికి మించి పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా ఖమ్మం, మిర్యాలగూడ, నిర్మల్ వంటి సరిహద్దు ప్రాంతాల్లో ఈ పరిస్థితి మరింత తీవ్రంగా కనిపిస్తోందన్నారు.

**వదంతుల ప్రభావం**
పశ్చిమ బెంగాల్ ఎన్నికల అనంతరం ఇంధన ధరలు పెరుగుతాయనే ..మిగతా 2లో

## విశ్రాంత ఉద్యోగులకు ఊరట...
## రూ.1,000 కోట్ల బకాయిల విడుదల

పెండింగ్ జీపీఎఫ్ బకాయిల క్లియర్
చేసిన తెలంగాణ ప్రభుత్వం
గతేడాది అక్టోబర్ వరకు
ఉన్న బకాయిల చెల్లింపు
రూ.1,000 కోట్ల నిధుల విడుదల
చెల్లింపుల జాప్యంపై
హైకోర్టు ఆగ్రహం తర్వాత చర్యలు
పెన్షనర్ల సమస్యల పరిష్కారంపై దృష్టి
ఆర్థిక శాఖ సమన్వయంతో చెల్లింపులు
ఉద్యోగ సంఘాల డిమాండ్లకు స్పందన
దశలవారీగా బకాయిల క్లియరెన్స్ ప్రక్రియ
భవిష్యత్తులో జాప్యం లేకుండా చర్యలు


2

# కేటీఆర్, హరీశ్‌రావుపై పరువు నష్టం దావా

నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ పిటిషన్

కాంగ్రెస్, తనపై దుష్ప్రచారం
చేశారని విమర్శ
జన్వాడ ఫాంహౌస్ పేరుతో
కట్టుకథలు సృష్టించారన్న ఆరోపణ
రూ.8 కోట్లు అడిగినట్లు అసత్య
ప్రచారం చేశారని ఆగ్రహం
రాజకీయంగా దెబ్బతీయాలనే
కుట్రగా వ్యాఖ్య
బీఆర్ఎస్ నేతలపై చట్టపరమైన
చర్యలకు శ్రీకారం
పరువు నష్టం కేసుతో
న్యాయపోరాటం ప్రారంభం
దుష్ప్రచారం ఆపాలని హెచ్చరిక
లేనిపక్షంలో తీవ్ర
పరిణామాలుంటాయని స్పష్టం




**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
తెలంగాణ రాజకీయాల్లో పరువు నష్టం వివాదం మళ్లీ హాట్‌టాపిక్‌గా మారింది. బీఆర్ఎస్ ప్రముఖ నేతలు కేటీఆర్, టి హరీశ్ రావుపై ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో పరువు నష్టం దావా దాఖలు చేసినట్లు వెల్లడించారు.

**తప్పుడు ప్రచారంపై ఆరోపణలు**
తనపై, అలాగే కాంగ్రెస్ పార్టీపై ..మిగతా 2లో

# కవితకు బిగ్ షాక్...

ఈసీకి తెలంగాణ
రాజ్య సమితి అధ్యక్షుడి లేఖ
2023లోనే తెలంగాణ
రాజ్య సమితి (టీఆర్ఎస్)ని
రిజిస్టర్ చేయించినట్లు వెల్లడి
టీఆర్ఎస్ పేరుతో మరో
పార్టీని రిజిస్టర్ చేస్తే తనకు
నష్టం జరుగుతుందని వెల్లడి



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) పార్టీ అధినేత్రి కవితకు తెలంగాణ రాజ్య సమితి (టీఆర్ఎస్) పార్టీ అధ్యక్షుడు తుపాకుల బాలరంగం షాకిచ్చారు. కేసీఆర్ స్థాపించిన తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)గా మారడంతో బాలరంగం తన పార్టీని 2023లో రిజిస్టర్ చేయించారు. ఈ నేపథ్యంలో కవిత 'టీఆర్ఎస్' పార్టీని రిజిస్టర్ చేయవద్దని, అలా చేస్తే ..మిగతా 2లో

# అట్టహాసంగా బీజేపీ జనాగ్రహ సభ

హాజరు కానున్న ప్రధాని నరేంద్ర మోడీ
మే 10న పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ
బహిరంగ సభకు ఏర్పాట్లు
లోక్‌సభ ఎన్నికల తర్వాత తొలిసారి
హైదరాబాద్‌కు మోదీ రాక
రూ.7 వేల కోట్ల అభివృద్ధి పనులకు
వర్చువల్ ప్రారంభం
రాష్ట్ర కార్యాలయంలో సభ పోస్టర్
ఆవిష్కరణ
డబుల్ ఇంజిన్ సర్కార్ లక్ష్యంగా
బీజేపీ ప్లాన్
కాంగ్రెస్‌పై బీజేపీ చీఫ్
రామచందర్‌రావు విమర్శలు
మహిళా రిజర్వేషన్
అంశంపై ఆరోపణలు




**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామంగా భావిస్తున్న బహిరంగ సభకు భాజపా ఏర్పాట్లు వేగవంతం చేసింది. మే 10న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభకు 'జనాగ్రహ సభ'గా నామకరణం చేసినట్లు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ..మిగతా 2లో

# రేవంత్ రెడ్డివి ఉత్తమాటలే

**మొదటిపేజీ తరువాయి**



సమయానికి అందకపోవడం వల్ల వారు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

తెలంగాణ భవన్‌లో కార్యక్రమం

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ పార్టీ శ్రేణులకు ఉత్సాహం నింపే ప్రయత్నం చేశారు.

**రైతు బంధు అమలుపై విమర్శ**

గతంలో "ఎవరు వచ్చినా రైతు బంధు ఆగదు" అని చెప్పిన నేతలు, ఇప్పుడు ఎందుకు రైతు బంధు నిధులను సకాలంలో ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రైతులకు అందాల్సిన సహాయం ఆలస్యం కావడం ప్రభుత్వం వైఫల్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు.

**యూరియా కొరతపై ఆందోళన**

రాష్ట్రంలో యూరియా అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని కేటీఆర్ అన్నారు. వ్యవసాయానికి కీలకమైన ఇన్‌పుట్‌లు సకాలంలో అందకపోవడం వల్ల పంటలపై ప్రభావం పడుతోందని తెలిపారు.

**పార్టీ పరిస్థితులపై స్పందన**

గత ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీ పరిస్థితులపై కూడా కేటీఆర్ స్పందించారు. వరుస దెబ్బలు తగిలితే పార్టీ శ్రేణుల్లో నిరుత్సాహం రావడం సహజమని అన్నారు. ఓటమి తర్వాత 10 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారడం, ఎంపీ సీట్లు గెలవలేకపోవడం వంటి అంశాలను ప్రస్తావించారు.

**కాంగ్రెస్‌పై ఆరోపణలు**

కాంగ్రెస్ పార్టీ మోసం చేసి అధికారంలోకి వచ్చిందని కేటీఆర్ ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీలకు ఇందిరమ్మ ఇళ్ల కోసం రూ.6 లక్షలు ఇస్తామని చెప్పి ఆ హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు.

**విద్యార్థుల సమస్యలు**

ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలులో కూడా ప్రభుత్వం విఫలమైందని కేటీఆర్ అన్నారు. గతంలో అమలు చేసిన ఈ పథకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగించిందని, ఇప్పుడు మాత్రం నిధులు ఇవ్వక విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోందని పేర్కొన్నారు. రైతులు, విద్యార్థులు, పేదల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని కేటీఆర్ ఆరోపించగా, దీనిపై కాంగ్రెస్ నేతల నుంచి ప్రతిస్పందన ఎలా ఉంటుందన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారింది.

## విశ్రాంత ఉద్యోగులకు ఊరట...రూ.1,000 కోట్ల

# బకాయిల విడుదల

- పెండింగ్ జీపీఎఫ్ బకాయిల క్లియర్ చేసిన తెలంగాణ ప్రభుత్వం
- గతేడాది అక్టోబర్ వరకు ఉన్న బకాయిల చెల్లింపు
- రూ.1,000 కోట్ల నిధుల విడుదల
- చెల్లింపుల జాప్యంపై హైకోర్టు ఆగ్రహం తర్వాత చర్యలు
- పెన్షనర్ల సమస్యల పరిష్కారంపై దృష్టి
- ఆర్థిక శాఖ సమన్వయంతో చెల్లింపులు
- ఉద్యోగ సంఘాల డిమాండ్లకు స్పందన
- దశలవారీగా బకాయిల క్లియరెన్స్ ప్రక్రియ
- భవిష్యత్తులో జాప్యం లేకుండా చర్యలు

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణలో విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. పెండింగ్‌లో ఉన్న బకాయిల చెల్లింపుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1,000 కోట్లను విడుదల చేసింది. ఈ నిధులతో గత ఏడాది అక్టోబర్ వరకు పెండింగ్‌లో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల జీపీఎఫ్ (జనరల్ ప్రావిడెంట్ ఫండ్) బకాయిలను క్లియర్ చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

**జీపీఎఫ్ బకాయిల చెల్లింపు**

ఉద్యోగ జీవితాంతం జమ చేసిన జీపీఎఫ్ మొత్తాన్ని రిటైర్మెంట్ తర్వాత పొందాల్సి ఉండగా, కొన్ని నెలలుగా ఈ చెల్లింపులు ఆలస్యం కావడంతో విశ్రాంత ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో ఈ పెండింగ్ మొత్తాలు క్లియర్ కావడం వారికి ఊరటనిచ్చింది.

**హైకోర్టు ఆగ్రహం తర్వాత చర్యలు**

రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపులో జరుగుతున్న జాప్యంపై తెలంగాణ హైకోర్టు ఇటీవల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వేగంగా స్పందించి నిధుల విడుదలకు ముందుకొచ్చింది.

**విశ్రాంత ఉద్యోగులకు ఊరట**

పలు నెలలుగా బకాయిల కోసం ఎదురుచూస్తున్న విశ్రాంత ఉద్యోగులకు ఈ నిర్ణయం ఉపశమనం కలిగించింది. తమ హక్కైన నిధులు సమయానికి అందకపోవడంతో ఎదురైన ఆర్థిక ఇబ్బందులు ఇప్పుడు కొంత వరకు తగ్గనున్నాయి.

**దశలవారీ చెల్లింపులు**

అధికారుల ప్రకారం, పెండింగ్‌లో ఉన్న బకాయిలను దశలవారీగా క్లియర్ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ప్రస్తుతం అక్టోబర్ వరకు ఉన్న బకాయిలను చెల్లించగా, మిగతా బకాయిలను కూడా త్వరలో చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

**ఉద్యోగ సంఘాల డిమాండ్లు**

ఈ అంశంపై ఉద్యోగ సంఘాలు కూడా పలు సార్లు ప్రభుత్వాన్ని కోరాయి. బకాయిల చెల్లింపులో జాప్యం ఉద్యోగులకు ఇబ్బందులు కలిగిస్తోందని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం తాజా నిర్ణయంతో వారి డిమాండ్లకు స్పందించినట్లు అయ్యింది. మొత్తం మీద, ప్రభుత్వం విడుదల చేసిన ఈ నిధులు విశ్రాంత ఉద్యోగులకు పెద్ద ఊరటనిచ్చాయి. భవిష్యత్తులో ఇలాంటి జాప్యాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

# కవితకు బిగ్ షాక్...

**మొదటిపేజీ తరువాయి**



తన పార్టీకి నష్టం జరుగుతుందని ఎన్నికల సంఘానికి లేఖ రాశారు.

తన టీఆర్ఎస్ పార్టీని ఎన్నికల సంఘం 2023లో రిజిస్టర్ చేసినట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్యాస్ సిలిండర్ గుర్తుతో పది నియోజకవర్గాల్లో పోటీ చేసినట్లు వెల్లడించారు. సిద్దిపేట జిల్లాకు చెందిన తుపాకుల బాలరంగం 'టీఆర్ఎస్' సంక్షిప్త నామంతో పార్టీని స్థాపించారు. బహుజనులకు రాజ్యాధికారం లక్ష్యంగా పార్టీని స్థాపించారు.

కవిత నాలుగు రోజుల క్రితం తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) పేరుతో పార్టీని స్థాపించిన విషయం తెలిసిందే. పాతికేళ్ల క్రితం కేసీఆర్ స్థాపించిన టీఆర్ఎస్ సంక్షిప్త నామం వచ్చేలా ఆమె పార్టీని ప్రకటించారు.

# ఐదు రాష్ట్రాల్లో ఎగిరేది కాషాయ జెండానే

**మొదటిపేజీ తరువాయి**

భయాందోళనలు ఉండేవని, కానీ ఇప్పుడు పరిస్థితులు మారుతున్నాయని ఆయన అన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా, భారీ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవడం చూస్తుంటే ప్రజాస్వామ్యంపై వారికి ఉన్న నమ్మకం అర్థమవుతోందని చెప్పారు. సోషల్ మీడియాలో కనిపిస్తున్న పొడవైన క్యూలే దీనికి నిదర్శనమని, బెంగాల్ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని మోదీ వ్యాఖ్యానించారు.

ఇటీవల జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికలు, గుజరాత్ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలను మోదీ ఈ సందర్భంగా గుర్తు చేశారు. గుజరాత్‌లో మున్సిపాలిటీలు, జిల్లా పంచాయతీల్లో దాదాపు 85 శాతం స్థానాలను బీజేపీ కైవసం చేసుకోవడం అనేది పార్టీ పట్ల ప్రజల్లో ఉన్న అచంచలమైన విశ్వాసానికి సంకేతమని అన్నారు. ఇదే ఊపు ఐదు రాష్ట్రాల ఎన్నికల్లోనూ కొనసాగుతుందని, మే 4న వెలువడే ఫలితాలు దేశాభివృద్ధి వేగానికి కొత్త శక్తిని ఇస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

మహిళా రిజర్వేషన్ బిల్లు (నారీ శక్తి బిల్లు) విషయంలో కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీల తీరును ప్రధాని తీవ్రంగా తప్పుపట్టారు. ఈ పార్టీలు అభివృద్ధికి మాత్రమే కాదు, మహిళా సాధికారతకు కూడా శత్రువులని ధ్వజమెత్తారు. ఒకవేళ గతంలోనే ఈ బిల్లు ఆమోదం పొంది ఉంటే, 2029 నాటికి లోక్‌సభ, శాసనసభల్లో మహిళల భాగస్వామ్యం గణనీయంగా పెరిగేదని ఆయన వివరించారు. ఇతర వర్గాల సీట్లకు భంగం కలగకుండానే మహిళలు చట్టసభలకు ఎన్నికై ఉండేవారని, కానీ విపక్షాలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం దీనిని అడ్డుకున్నాయని విమర్శించారు.

ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి గురించి ప్రస్తావిస్తూ.. ఒకప్పుడు రోడ్లపై గుంతలకు పేరుగాంచిన రాష్ట్రం నేడు 'ఎక్స్‌ప్రెస్ వేల రాష్ట్రం'గా మారిందని మోదీ కొనియాడారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం (కేంద్రం మరియు రాష్ట్రంలో ఒకే పార్టీ పాలన) వల్ల యూపీ అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని చెప్పారు. హర్దోయ్, ఉన్నావ్ వంటి జిల్లాల్లో పారిశ్రామిక కారిడార్లు వస్తాయని గత ప్రభుత్వాల హయాంలో ఎవరూ ఊహించలేదని, బీజేపీ ప్రభుత్వం ఆ కలను సాకారం చేస్తోందని అన్నారు.

గతంలో వెనుకబడిన రాష్ట్రంగా (బిమారు రాష్ట్రంగా) ముద్రపడిన ఉత్తర్ ప్రదేశ్, నేడు ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థ దిశగా అడుగులు వేస్తోందని ప్రధాని గర్వంగా ప్రకటించారు. ఇది కేవలం మాటలు కాదని, పక్కా ప్రణాళికతో జరుగుతున్న కృషి అని ఆయన స్పష్టం చేశారు. యూపీలో ఉన్న యువశక్తిని దేశ నిర్మాణంలో భాగస్వాములను చేస్తామని, రాష్ట్రాన్ని గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మారుస్తామని హామీ ఇచ్చారు. భారీ పెట్టుబడుల ద్వారా కొత్త పరిశ్రమలు రావడం వల్ల యువతకు ఇంటి



దగ్గరే ఉపాధి లభిస్తుందని మోదీ వివరించారు. సమాజ్ వాదీ పార్టీ మరియు దాని మిత్రపక్షాల పట్ల ఉత్తర్ ప్రదేశ్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అభివృద్ధిని అడ్డుకునే శక్తులకు మళ్ళీ అవకాశం ఇవ్వొద్దని ప్రధాని మోదీ ఈ సభా ముఖంగా పిలుపునిచ్చారు. ప్రధాని ప్రసంగం పొడవునా ప్రజల నుంచి 'మోదీ మోదీ' అనే నినాదాలు మిన్నంటాయి.

## అవసరానికి మించి పెట్రోల్, డీజిల్ కొంటున్నారు

**మొదటిపేజీ తరువాయి**



ఊహాగానాలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం కావడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని మంత్రి వివరించారు. ఈ వదంతులను నమ్మిన ప్రజలు ముందస్తుగా నిల్వలు చేసుకునే ప్రయత్నం చేయడంతో డిమాండ్ ఒక్కసారిగా పెరిగిందన్నారు.

హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాల్లో ఇదే పరిస్థితి నెలకొనడం ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసింది.

**సరఫరా పెంపు చర్యలు**

ఇంధన కొరత లేకుండా చూడటానికి ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టింది. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు నిరంతరం 24 గంటలూ పనిచేయాలని ప్రభుత్వం కోరింది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 3,817 ట్యాంకర్ల ద్వారా ఇంధన సరఫరా నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

జిల్లా స్థాయిలో పరిస్థితులను అంచనా వేయడానికి కలెక్టర్లతో కలిసి జిల్లా ఇంధన సరఫరా కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ కమిటీలు స్థానికంగా సరఫరా, డిమాండ్‌ను సమన్వయం చేస్తూ సమస్యలు తలెత్తకుండా చూస్తున్నాయి.

**కఠిన పర్యవేక్షణ**

పెట్రోల్, డీజిల్ అవుట్‌లెట్ల వద్ద నిల్వలను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తున్నారు. ప్రతి నాలుగు గంటలకు ఒకసారి తాజా సమాచారం సేకరిస్తూ సరిపడా నిల్వలు ఉన్నాయో లేదో పరిశీలిస్తున్నారు. అవసరమైన చోట వెంటనే ట్యాంకర్లను పంపించేలా అధికారులు సిద్ధంగా ఉన్నారు.

ప్రజలు అనవసరంగా నిల్వలు చేసుకోవద్దని, వదంతులను నమ్మవద్దని ప్రభుత్వం పిలుపునిచ్చింది. ఎక్కడైనా ఇంధన కొరత లేదా అక్రమ నిల్వలపై అనుమానం ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 1967కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

**కేంద్రం స్పందన**

ఇక ఈ పరిణామాలపై కేంద్రమంత్రి జి కిషన్ రెడ్డి కూడా సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ దిల్‌కుషా గెస్ట్‌హౌస్‌లో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు.

రాష్ట్రంలో ఇంధన కొరత ఉందనే ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి పరిస్థితులు రాకుండా తెలంగాణ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.

**దుష్ప్రచారంపై హెచ్చరిక**

సామాజిక మాధ్యమాల్లో ఇంధన కొరతపై జరుగుతున్న దుష్ప్రచారంపై కఠిన చర్యలు తీసుకోవాలని కిషన్‌రెడ్డి సూచించారు. ప్రజల్లో అపోహలు కలిగించే విధంగా సమాచారాన్ని వ్యాప్తి చేయడం వల్లే సమస్యలు తీవ్రం అవుతున్నాయని అన్నారు. ఇంధన సరఫరాపై ఎలాంటి సందేహాలున్నా కేంద్రం పూర్తి సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. ప్రస్తుతం పరిస్థితి నియంత్రణలోనే ఉన్నప్పటికీ, వదంతులు కొనసాగితే డిమాండ్‌సరఫరా సమతుల్యత దెబ్బతినే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా మాత్రమే ఈ సమస్యను పూర్తిగా నివారించవచ్చని స్పష్టం చేస్తున్నారు.

## కేటీఆర్, హరీశ్‌రావుపై పరువు నష్టం దావా

**మొదటిపేజీ తరువాయి**

బీఆర్ఎస్ నేతలు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని సంపత్‌కుమార్ ఆరోపించారు. రాజకీయంగా దెబ్బతీయాలనే ఉద్దేశంతో అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

**జన్వాడ ఫాంహౌస్ వివాదం**

జన్వాడ ఫాంహౌస్ పేరుతో పూర్తిగా కట్టుకథలు రచించారని ఆయన ఆరోపించారు. ప్రజలను తప్పుదారి పట్టించేలా కథనాలు సృష్టించి ప్రచారం చేశారని మండిపడ్డారు. ఈ ప్రచారంతో తన ప్రతిష్ఠకు తీవ్ర నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.

**రూ.8 కోట్ల ఆరోపణ**

ఒక కాంట్రాక్టర్ వద్ద నుంచి తాను రూ.8 కోట్లు అడిగినట్లు ప్రచారం చేయడం పూర్తిగా అసత్యమని సంపత్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారమని, తనను రాజకీయంగా బలహీనపర్చడానికి చేసిన ప్రయత్నమని అన్నారు.

**న్యాయపోరాటానికి శ్రీకారం**

ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ నేతలపై పరువు నష్టం దావా వేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై విచారణ కొనసాగనుంది.

తనపై చేసిన ఆరోపణలను న్యాయస్థానం ముందు సవాల్ చేస్తానని, నిజానిజాలు వెలుగులోకి తీసుకొస్తానని స్పష్టం చేశారు.

**బీఆర్ఎస్‌కు హెచ్చరిక**


ఇలాంటి రాజకీయాలు మానుకోవాలని బీఆర్ఎస్ నేతలకు సంపత్‌కుమార్ హెచ్చరిక జారీ చేశారు. అసత్య ప్రచారాలతో రాజకీయ లాభాలు పొందాలని ప్రయత్నిస్తే సహించబోమని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి దుష్ప్రచారం కొనసాగితే మరింత కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ పరిణామంతో తెలంగాణ రాజకీయాల్లో మాటల యుద్ధం మరింత ముదురే సూచనలు కనిపిస్తున్నాయి. కోర్టు విచారణలో ఏమి తేలుతుందన్నదానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.





# కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ బోగస్

**మొదటిపేజీ తరువాయి**



రైతులకు కంటిమీద కునుకు లేకుండాపోతున్నదన్నారు. చివరకు మిల్లులోనూ దించుకునే సమయంలో బస్తాకు ఒకటి రెండు కిలోల తరుగు తీస్తున్నారని ఆరోపించారు. జొన్నలు, పొద్దు తిరుగుడు, శనగలను బేషరతుగా ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. మొక్కజొన్న కొనుగోళ్లలో నిబంధనలు సడలించాలన్నారు. వరి ధాన్యం సేకరణలో రైతులపై కక్షపూరిత ధోరణి సరికాదన్నారు. తక్షణమే కొనుగోళ్లు చేపట్టి ధాన్యం డబ్బులతోపాటు యాసంగి బోనస్‌ను వెంటనే జమచేయాలని కోరారు. ఈ మేరకు బుధవారం సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. పంట కొనుగోళ్లలో మీరు కొత్త సంస్కరణలు చేపట్టకున్నా పాత పద్ధతిని కూడా అమలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. జొన్నలు, శనగ, మొక్కజొన్న, పొద్దు తిరుగుడు, వరి పంటలు సాగుచేశారని, చివరి గింజ దాకా కొనాలని డిమాండ్ చేశారు.

**కొనుగోలు కేంద్రాల్లో రైతుల పడిగాపులు**

పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాల్లో గత 20 రోజులుగా రైతులు పడిగాపులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో 17 వేల ఎకరాల్లో పొద్దు తిరుగుడు సాగుచేశారని, ఎకరాకు 9 నుంచి 10 క్వింటాళ్ల లెక్కన 1,65,000 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. ఇందులో కేంద్రం తన వాటాగా నాలుగో వంతు పంట కొనుగోలు చేసి చేతులెత్తేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక రాష్ట్రవాటాగా మిగిలిన పంటను మీరు కొనుగోలు చేయకతప్పదని దాదాపు ఒక లక్ష 20వేల క్వింటాళ్ల పొద్దు తిరుగుడు పంట ఇంకా రైతుల వద్దే నిల్వ ఉందన్నారు. ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ.7,721 మద్దతు ధరతో కొనుగోలు చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేయకుంటే రైతులు క్వింటాలుకు రూ.4వేల నుంచి రూ.5వేలకే ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకునే దుస్థితి దాపురించిందన్నారు.

**రైతులపై కక్ష పూరితంగా వ్యవహరిస్తారా?**

శనగల కొనుగోళ్లలోనూ రైతులపై కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, రంగారెడ్డి తదితర జిల్లాల్లో సుమారు 3 లక్షల ఎకరాల విస్తీర్ణంలో శనగ సాగు చేస్తున్నారని, ఎకరాకు 8 క్వింటాళ్ల చొప్పున 24 లక్షల క్వింటాళ్ల దిగుబడి అంచనా ఉందని, కొండంత పంట పండితే మీరు మార్క్‌ఫెడ్ ద్వారా గోరంత మాత్రమే కొనుగోలు చేసి మమ అనిపించారని మండిపడ్డారు. సంగారెడ్డి జిల్లాలో 30,891 ఎకరాల్లో శనగ సాగు చేయగా 2 లక్షల 41 వేల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, కానీ, ఇప్పటివరకు 38 వేల క్వింటాల్లే కొనుగోలు చేశారన్నారు.

**కొనుగోలు కేంద్రాలు పేరుకేనా?**

రాష్ట్రంలోని కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, ఆదిలాబాద్, వికారాబాద్, గద్వాల జిల్లాల్లో సుమారు 4 లక్షల ఎకరాల్లో జొన్న విస్తీర్ణం సాగు చేశారని, దాదాపు 6 నుంచి 7 లక్షల క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. కానీ, ఇప్పటి దాకా కొనుగోలు కేంద్రాలను సైతం ఏర్పాటు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. మొక్కజొన్న ఈ యాసంగిలో దాదాపు 13 లక్షల ఎకరాల్లో సాగు చేయగా 40 లక్షల టన్నుల వరకు దిగుబడి వస్తుందని అంచనా ఉందన్నారు. రాష్ట్రంలో 226 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా ఎక్కడ కూడా సక్రమంగా కొనుగోళ్లు జరగడం లేదని మండిపడ్డారు. ఇప్పటివరకు 2 లక్షల టన్నులు కొనక పోవడమే అందుకు నిదర్శనమన్నారు. ఎకరాకు 26.50 క్వింటాళ్ల మొక్కజొన్నలే కొనుగోలు చేస్తామని నిబంధన విధించడం సరికాదని సూచించారు. పేరుకే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారే తప్ప కొనుగోళ్లు మాత్రం చేయడం లేదని మండిపడ్డారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించి కొనుగోలు పూర్తి చేయాలని, ఇచ్చిన మాట ప్రకారం క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ డబ్బులను కూడా ధాన్యం డబ్బులతో పాటే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.

# అట్టహాసంగా బీజేపీ జనాగ్రహ సభ

**మొదటిపేజీ తరువాయి**

రామచందర్ రావు వెల్లడించారు.

**పోస్టర్ ఆవిష్కరణ**

హైదరాబాద్‌లోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఈ సభకు సంబంధించిన పోస్టర్‌ను పార్టీ ముఖ్య నేతల సమక్షంలో రామచందర్‌రావు ఆవిష్కరించారు. సభను విజయవంతం చేయడానికి రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు.

**మోదీ తొలి పర్యటన**

లోక్‌సభ ఎన్నికల అనంతరం ప్రధాని మోదీ తొలిసారి హైదరాబాద్‌కు రానుండటం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.

**భారీ అభివృద్ధి పనులు**

సుమారు రూ.7 వేల కోట్లకు పైగా వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను ఈ సభ వేదికగా ప్రారంభించనున్నట్లు భాజపా నేతలు తెలిపారు. మౌలిక వసతులు, రవాణా, ఇతర కీలక రంగాలకు సంబంధించిన ప్రాజెక్టులు ఇందులో ఉండనున్నాయని పేర్కొన్నారు.

**డబుల్ ఇంజిన్ సర్కార్‌పై దృష్టి**

తెలంగాణ అభివృద్ధి వేగవంతం కావాలంటే కేంద్రం-రాష్ట్రం కలిసి పనిచేసే డబుల్ ఇంజిన్ సర్కార్ అవసరమని ప్రజలు భావిస్తున్నారని రామచందర్‌రావు అన్నారు. భాజపా అధికారంలోకి వస్తే అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని పేర్కొన్నారు.

**కాంగ్రెస్‌పై విమర్శలు**

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ అడ్డుకుందని ఆరోపించారు. మహిళల రాజకీయ ప్రాతినిధ్యం పెరగకుండా కాంగ్రెస్ ప్రయత్నించిందని అన్నారు.

**విభజన రాజకీయాల ఆరోపణ**

ఉత్తరాది-దక్షిణాది అనే పేరుతో కాంగ్రెస్ విభజన రాజకీయాలు చేస్తోందని రామచందర్‌రావు ఆరోపించారు. దేశ ఐక్యతకు విఘాతం కలిగించే విధంగా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ 'జనాగ్రహ సభ'తో తెలంగాణలో భాజపా రాజకీయంగా బలపడేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు కనిపిస్తోంది. ప్రధాని మోదీ పర్యటన రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చలకు దారి తీసే అవకాశం ఉంది.



# ఇందిరమ్మ ఇళ్లతో సొంతింటి కల సాకారం

**నిజామాబాద్, పోతంగల్, ఏప్రిల్ 29 (ప్రజా స్వరం):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని తిరుమలాపూర్ గ్రామంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి గ్రామపంచాయతీ సర్పంచ్ బోయ సైదవ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బోయ సైదవ మాట్లాడుతూ, గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తవడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన బిల్లులు సమయానికి అందుబాటులోకి రావడం వల్ల లబ్ధిదారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గృహనిర్మాణం పూర్తి చేసుకోగలిగారని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న గృహ పథకాల ద్వారా పేద ప్రజలకు శాశ్వత నివాసం కల్పించడం ముఖ్య లక్ష్యమని, ఈ పథకం గ్రామీణ ప్రాంతాల్లో జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తోందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంజీవ్, ఎంపీడీవో చందర్ నాయక్, హౌసింగ్ ఏఈ ఆదర్శ్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్ గౌడ్, గ్రామ సభ్యులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్త ఇళ్లలో ప్రవేశించిన లబ్ధిదారులు ప్రభుత్వానికి, గ్రామ ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా, గృహప్రవేశ కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య జరిగింది.




# పల్లికొండలో దొంగతనం

- **ఐదు తులాల బంగారం అపహరణ**

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 29(ప్రజా స్వరం) :**

భీంగల్ మండలంలోని పల్లికొండ గ్రామంలో దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసి ఉన్న ఇంట్లోకి చొరబడి సుమారు ఐదు తులాల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. బాధితుడు తెడ్డు బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి మేడపై నిద్రపోయారు. బుధవారం తెల్లవారుజామున సుమారు 3:20 గంటల ప్రాంతంలో కిందికి వచ్చి చూడగా, ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించి దిగ్భ్రాంతికి గురయ్యారు. లోపలికి వెళ్లి చూడగా సామాన్లన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. బెడ్‌రూమ్‌లోని బీరువాను పగులగొట్టిన దుండగులు.. అందులోని లాకర్‌ను తెరిచి బంగారు ఉంగరాలు, పతానం ఉంగరం, చెవి కమ్మలు, మాటీలు, రింగులు, రెండు గొలుసులు, పోగులతో పాటు వెండి పాదసరాలను అపహరించుకుపోయారు. అపహరణకు గురైన బంగారం సుమారు ఐదు తులాల వరకు ఉంటుందని బాధితుడు వాపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు భీంగల్ ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీమ్ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని వేలిముద్రలు సేకరించారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.



# సాలూరలో ముగిసిన జనగణన శిక్షణ కార్యక్రమం

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 29(ప్రజా స్వరం) :**



సాలూర మండల కేంద్రంలోని రైతు వేదికలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న జనగణన2027 తొలి విడత శిక్షణ కార్యక్రమం బుధవారం విజయవంతంగా ముగిసింది. ఏప్రిల్ 27న ప్రారంభమైన ఈ శిబిరంలో మండలంలోని 36 మంది ఎన్యూమరేటర్లు, ఆరుగురు సూపర్‌వైజర్లు, రిజర్వ్ సిబ్బందికి జనగణన ప్రక్రియపై ఫీల్డ్ ట్రైనర్లు ఆర్.శివకుమార్, బి.శివకుమార్ సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహాల్దార్ నవాజ్, ఎంపీడీఓ శ్రీనివాస్ లు మాట్లాడుతూ.. మే 11వ తేదీ నుంచి ఎన్యూమరేటర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రతి ఇంటిని సందర్శిస్తారని వెల్లడించారు. మొత్తం 34 అంశాలతో కూడిన ప్రశ్నావళి ద్వారా నివాస గృహాల స్థితిగతులు, కుటుంబ సభ్యుల వివరాలు, మౌలిక సదుపాయాల సమాచారాన్ని సేకరించనున్నట్లు వివరించారు. గ్రామాల్లోకి వచ్చే సిబ్బందికి ప్రజలు ఖచ్చితమైన సమాచారం అందించి సహకరించాలని కోరారు

# శివ్వంపేట్ లో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించిన.. ఆవుల రాజిరెడ్డి

**తూప్రాన్ ఏప్రిల్ 29 (ప్రజా స్వరం )**

మెదక్ జిల్లా మండల కేంద్రమైన శివ్వంపేట బొట్టు లక్ష్మి నర్సింలు దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి హాజరై శుభాకాంక్షలు తెలియజేసిన నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల ర రాజి రెడ్డి ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం అర్హులైన ప్రతి కుటుంబం కు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి స్వంత ఇంటి కల స్వప్నం నెరవేరుస్తునట్లు ఆయన అన్నారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టతమాకంగా తీసుకున్న పథకం ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ఇల్లు ఉండలన్న లక్ష్యంతో గ్రామ సభలో దరఖాస్తు లు స్వీకరించి మంజూరు చేస్తున్నట్లు రాజి రెడ్డి తెలిపారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్తా పిఎసిఎస్ మాజీ చైర్మన్ వెంకట్రాంరెడ్డి గారు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మధవ రెడ్డి గారు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు మురళి గౌడ్ గారు, ఎక్స్ జెడ్పిటిసిలు లక్ష్మీకాంతం గారు, కమల గారు, రత్నాపూర్ సర్పంచ్ ఆంజనేయులు గారు, దొంతి ఉపసర్పంచ్ శ్రీనివాస్ గారు, పిల్లుట్ల ఉప సర్పంచ్ స్వామి గారు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల వారాల గణేష్ గారు, గడ్డ మీది కృష్ణ గౌడ్ గారు, నారా గౌడ్ గారు మంతూరి రమేష్ గౌడ్ గారు, మండల ఎక్స్ కోఆప్షన్ సభ్యులు దావూద్ గారు కుమ్మరి ఆంజనేయులు గారు కుమ్మరి హనుమంతు గారు గొల్ల యాదయ్య గారు గొల్ల



రాములు గారు, బిచ్కుందు అంజయ్య, కమలయ్య గారి వెంకటేష్, బిజిలిపురం సత్తయ్య, వార్డు సభ్యులు ఇసారపు రాజు గౌడ్, దేవన బోయిన కృష్ణ, కోలా కిషన్, బాసంపల్లి ,ప్రభు లింగం గౌడ్, సద్దాం హుస్సేన్, షేక్ అలీ, వజ్జా శ్రీనివాస్, వెతుకు మల్లేష్, ఈసు గారి అరుణ్, సాకలి భరత్, భాస్కర్ ఆంజనేయులు, మ్యాస ఆంజనేయులు, సరిగారి నారాయణ, కమలయ్య గారి రాములు మరియు కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



# మెదక్ జిల్లాలో తూప్రాన్ శ్రీ చైతన్య పాఠశాల పదవ తరగతి ఫలితాల్లో ప్రభంజనం

**తూప్రాన్ ఏప్రిల్ 29 (ప్రజా స్వరం )**

మెదక్ జిల్లాలో తూప్రాన్ పట్టణం లోని శ్రీ చైతన్య పాఠశాలకు పదవ తరగతి ఫలితాల్లో మొదటి, రెండవ ర్యాంకులు మెదక్ జిల్లా, తూప్రాన్‌లోని శ్రీచైతన్య పాఠశాల పదవ తరగతి (SSC) ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బుధవారం వెలబడిన పదవ తరగతి ఫలితాలలో జిల్లాలోనే మొదటి మరియు రెండవ ర్యాంకులను సాధించింది. ఈ సందర్భంగా మా పాఠశాల విద్యార్థి ఎం. అద్వైత 600లో 588 మార్కులు సాధించి మొదటి ర్యాంక్ సాధించగా, వి. రుషిక్ 600లో 585 మార్కులు సాధించి రెండవ ర్యాంక్ పొందారు. ఈ విద్యా సంవత్సరంలో పాఠశాల 100% ఉత్తీర్ణత సాధించి మరోసారి తన ప్రతిష్టను నిలబెట్టుకుంది.కొంపల్లి జోన్ ఏజీఎం జి.వి. రమణా రావు విజేత విద్యార్థులను అభినందించారు.జోనల్ కోఆర్డినేటర్ రవి అసోసియేట్ కోఆర్డినేటర్ సోమేష్ పాల్గొన్నారు.



పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతు మా విద్యార్థులు సాధించిన ఈ అద్భుత ఫలితాలు వారి కృషి, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల సహకారం వల్ల సాధ్యమయ్యాయి. భవిష్యత్తులో కూడా ఇలాంటి విజయాలు సాధిస్తూ మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆశిస్తున్నాము. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డీన్ అశోక్ రెడ్డి ,పాఠశాల ఉపాధ్యాయులు బృందం ఉత్సాహంగా పాల్గొన్నారు.

# గీతా హై స్కూల్ లో ఉత్తమ ఫలితాలు....

**తూప్రాన్ ఏప్రిల్ 29 (ప్రజా స్వరం )**

మెదక్ జిల్లా తూప్రాన్ గీత హై స్కూల్ పదవ తరగతి విద్యార్థుల ఉత్తమ ఫలితాలు సాధించారు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదలైన పదవ తరగతి ఫలితాలలో తూప్రాన్ గీతా స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. కొమిడాల సాయిచరణ్ రెడ్డి (575) పి. రాజేష్ (574) జి. శ్రీజ (574) సుధామహి (571) ఏ. చరణ్k (571) వి. భవ్య (571) బి . వరుణ్ (569) జి. స్ఫూర్తి (568) కే. విఘ్నేశ్ (568) లు అత్యుత్తమ మార్కులు సాధించారు. పాఠశాల చదువుతున్న విద్యార్థుల లో 106 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించినట్లు కరెస్పాండెంట్ పి. రామాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్ పర్సన్ పి. ఉష, డైరెక్టర్లు రాఘవేందర్ గౌడ్, నారాయణ గుప్త, భరత్, డాక్టర్ మౌనిక ప్రిన్సిపాల్ అరుణ, ఇంచార్జి ప్రిన్సిపాల్ ప్రేమ్ రాజ్, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వర్ తో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.




# తెలంగాణ కోకిల గానం " బెల్లి లలితక్కకు అరుణ నివాళి "...!

**దుబ్బాక ప్రజా స్వరం ఏప్రిల్ 29:**

తెలంగాణ మట్టిలో మొలిచిన స్వర సిరి నువ్వే, పల్లె పొలిమేరల్లో పలికిన పాటల తార నువ్వే, బతుకుల బాటలో వెలుగునిచ్చిన దీపస్తంభం మన బెల్లి లలితక్క, నీ జ్ఞాపకం శాశ్వతం--- జయంతి వేళ ఇది జ్ఞాపకాల జల్లు, నీ గానం వినిపిస్తే గుండెలో తీయని నొప్పి, కన్నీటి చుక్కల్లో కూడా గర్వం మెదిలేలా నీ స్వరం మనలో జీవిస్తుంది. పాటలలో పలికిన ప్రజల గాథలు, పల్లె బాధలకు పలుకరించిన ఓదార్పు, నీ గళం వినిపిస్తే చాలు మట్టికే మానవత్వం వచ్చినట్టుంది--- గాన కోకిలగా గానం చేసిన ప్రతి స్వరం ఉద్యమానికి ఊపిరిగా మారింది, నీ పాట ఒక పిలుపై, నీ గానం ఒక పోరాట జ్యోతి--- పూదోటలో పూసిన పువ్వులా నీ పాటలు, కాలాన్ని దాటి మనసుల్లో నిలిచాయి, తరతరాలకు మార్గదర్శకంగా నిలిచే నీ జ్ఞాపకం ఒక చిరస్థాయి చరిత్ర--- బెల్లి లలితక్క--- నీ పేరు వినగానే గుండె గర్వంతో నిండిపోతుంది, నీ గానం వినగానే జీవితం గీతంలా మారుతుంది, నీ జయంతి రోజు మా వందనాలు అర్పణ--- తెలంగాణ తల్లి ఒడిలో నిత్యం మార్మోగే స్వరమే నువ్వు, పాటల కోకిలగా పుట్టి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన అమర గాత్రం--- నీ పాటల ప్రతిధ్వని ఎప్పటికీ ఆగదు, నీ జ్ఞాపకం ఎప్పటికీ మసకవదు, గాన కోకిల బెల్లి లలితక్క నీకు మా హృదయ పూర్వక వందనాలు మహమ్మద్ సుల్తాన ఉమర్ సోషల్ రిఫార్మేషన్ ఫౌండేషన్ అధ్యక్షురాలు, సామాజిక ప్రజాసేవకురాలు.



# దుబ్బాక మండలంలో జోరుగా " బెల్ట్ షాప్ లు, "...!

- **మొద్దు నిద్ర లో ఎక్సైజ్ అధికారులు**
- **దుబ్బాకలో 20 పోయిన బెల్ట్ షాపులో నడుస్తున్న పట్టించుకోని వైనం**

**దుబ్బాక, ఏప్రిల్ 29: ప్రజా స్వరం**

దుబ్బాక మండలంలోని షాపులు జోరుగా నడుస్తున్నాయి. వైన్స్ యజమానులే వారికి ఆటోలలో.. ద్విచక్ర వాహనంపై పార్సల్ చేస్తున్న వైనం ఉంది. కేవలం దుబ్బాక పట్టణంలోనే 20 నుండి 25 బెల్ట్ ఉన్న పట్టించుకున్న దాఖరాలు లేవు. మరి వారికి కమిషన్లు ఇస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు పలువురు. మద్యంశాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ముడుపులు ముట్టాయా అని కొంతమంది అంటున్నారు. ఇప్పటికైనా మద్యం శాఖ అధికారులు మొద్దు నిద్ర వేడి బెల్ట్ పై చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు. మీకు లాభం రాగానే సరిపోదు సంసారాలు విచ్ఛిన్నం అవుతున్నాయని మహిళలు అంటున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.



## ఆ ఒత్తిడిని భరించలేకపోయానంటూ వెక్కి వెక్కి ఏడ్చిన పాయల్..

హాట్ బ్యూటీ పాయల్ రాజ్‌పుత్ 'ఆర్ఎక్స్ 100' సినిమాతో టాలీవుడ్‌లోకి గ్లామరస్ ఎంట్రీ ఇచ్చి యూత్‌లో సెన్సేషన్ క్రియేట్ చేసింది. మొదటి సినిమాతోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న ఈ భామ, ఆ తర్వాత 'మంగళవారం' వంటి వైవిధ్యమైన చిత్రంతో తన నటనలోని మరో కోణాన్ని చూపించింది. ప్రస్తుతం ఈమె తన బాయ్‌ఫ్రెండ్ సౌరబ్ ధింగ్ర హీరోగా పరిచయం అవుతున్న 'ఫస్ట్ టైమ్' సినిమాలో హీరోయిన్‌గా నటిస్తోంది. తాజాగా, ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో పాయల్ చేసిన పని అందరినీ షాక్‌కు గురి చేయడమే కాకుండా, అందరినీ ఎమోషనల్ అయ్యేలా చేసింది. ఈ వెంట్ మధ్యలో పాయల్ ఒక్కసారిగా భావోద్వేగానికి లోనై కన్నీరు పెట్టుకుంది. గత కొంతకాలంగా తన కుటుంబం ఎదుర్కొంటున్న మానసిక సంఘర్షణను తలుచుకుని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

"మా నాన్న క్యాన్సర్ బారిన పడటం మా కుటుంబానికి అత్యంత కష్టకాలం. ఒకవైపు ఆయన ఆరోగ్యం క్షీణించడం, మరోవైపు ఆ మానసిక వేదన నన్ను తీవ్ర ఒత్తిడికి గురి చేశాయి. ఆ బాధను భరించలేక నేను జైపూర్‌లో విపాసన ధ్యానం కోసం కూడా వెళ్లాను. అది నాకు కొంచెం ఊరటనిచ్చింది" అని పాయల్ చెప్పుకొచ్చింది. తన తండ్రితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ.. "నా ప్రతి పనిని నాన్న ఎంతో శ్రద్ధగా గమనించేవారు. నా మొదటి సినిమా 'ఆర్ఎక్స్ 100' చూసి ఆయన నన్ను ఎంతో మెచ్చుకున్నారు. అలాంటి వ్యక్తి చనిపోయి అప్పుడే ఏడాది కావస్తోంది" అని చెబుతూ పాయల్ వెక్కి వెక్కి ఏడ్చింది. ఆ బాధలో ఆమె ఈవెంట్ మధ్యలోనే స్టేజ్ పై నుండి వెళ్ళిపోవడం అక్కడ ఉన్న వారందరినీ కలిచివేసింది. తండ్రిని కోల్పోయిన బాధ నుండి పాయల్ ఇంకా కోలుకోలేదని ఈ సంఘటనతో స్పష్టమైంది. ప్రస్తుతం ఈ ఎమోషనల్ వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.



## 'మైసా' కోసం రష్మిక రిస్క్.. 80 అడుగుల ఎత్తు నుంచి జంప్

పాత్ర కోసం ఎంత రిస్క్ అయినా తీసుకునే కథానాయికల్లో రష్మిక ముందు వరుసలో ఉంటారు. తాజాగా ఆమె మరోసారి నటనపై తనకున్న నిబద్ధతను చాటుకున్నారు. తాను నటిస్తోన్న 'మైసా' కోసం మునుపెన్నడూ లేనివిధంగా కష్టపడుతున్నారు. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంలో రష్మిక గోండు తెగకు చెందిన మహిళగా కనిపించనున్నారు. ఈ సినిమా కోసం ఆమె చేసిన సవాలుతో కూడిన స్టంట్స్ గురించి 'మైసా' డైరెక్టర్ రవీంద్ర పుల్లె తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు.

''రష్మిక పోషిస్తున్న పాత్ర పేరు 'మైసా'. చాలా ప్రభావవంతమైన పాత్ర. ఆమె ప్రదర్శించే కోపం, ఆవేశం ఈ సినిమాకు హైలైట్. ఇటీవలే కేరళలోని అతిరపల్లి జలపాతం వద్ద ఒక క్లిష్టమైన యాక్షన్ సీన్ చిత్రీకరించాం. రష్మిక డూప్ లేకుండా 80 అడుగుల ఎత్తు నుంచి దూకారు. ఆ సమయంలో ఆమె చేతులకు, కాళ్లకు గాయాలయ్యాయి. అయినా విరామం తీసుకోకుండా షూటింగ్‌లో పాల్గొన్నారు. ఆమె నిబద్ధత చూసి చిత్రబృందమంతా ఆశ్చర్యపోయింది'' అని తెలిపారు.



ఈ చిత్రం కోసం అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్ కెచా ఖంపక్డీ ఆధ్వర్యంలో రష్మిక శిక్షణ పొందినట్లు డైరెక్టర్ వెల్లడించారు. బ్యాంకాక్‌లో వారం రోజుల పాటు ప్రతిరోజూ 8 గంటల పాటు కఠినమైన యుద్ధ విద్యలను నేర్చుకున్నట్లు తెలిపారు. మార్షల్ ఆర్ట్స్, గిరిజన పోరాట పద్ధతులను కలిపి ఈ సినిమా కోసం ఓ కొత్తతరహా యాక్షన్ శైలిని డిజైన్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

## ఈ కథ చెప్పినప్పుడు.. నా కథ నాకే చెప్పాడా అనిపించింది!

హైదరాబాద్ లోని ఏఎంబి సినిమాస్ లో జరిగిన 'ఎపిక్' టీజర్ ఆవిష్కరణ వేడుకలో హీరో ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ.. "ఎపిక్ టీజర్ మీ అందరికీ నచ్చింది అనుకుంటున్నాను. ఎపిక్ సినిమా చేయడం చాలా చాలా సంతోషంగా ఉంది. ఆదిత్య హాసన్ వచ్చి ఈ కథ చెప్పినప్పుడు.. నా కథ నాకే చెప్పాడా అనిపించింది. ఎందుకంటే నేనూ విదేశాల్లో చదువుకున్నాను. ఇందులోని చాలా సన్నివేశాలు నాకు కనెక్ట్ అయ్యాయి. విదేశాలకు వెళ్ళి చదువుకున్న వాళ్ళకు మాత్రమే కాదు.. ఈ కథలోని భావోద్వేగాలు ప్రతి ఒక్కరికీ నచ్చుతాయి. కుటుంబం, ప్రేమ, బంధం, భావోద్వేగాలు ఇలా ప్రతిదీ మీ మనసుకు నచ్చుతాయి. దర్శకుడు ఆదిత్య హాసన్ లో ఎంతో ప్రతిభ ఉంది. భవిష్యత్తులో ఆదిత్యను స్ఫూర్తిగా తీసుకొని ఎందరో కొత్త దర్శకులు వస్తారు. వైష్ణవి చైతన్య లాంటి ప్రతిభగల నటితో నటించడం సంతోషంగా ఉంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ లాంటి సంస్థలో సినిమా చేయడం ఆనందంగా ఉంది. సార్, లక్కీ భాస్కర్, టిల్లు, మ్యాడ్, జెర్సీ లాంటి సినిమాల సరసన ఎపిక్ చేరుతుందనే నమ్మకం ఉంది. మన చిన్నప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసేలా ఈ సినిమా ఉంటుంది. సినిమా చూస్తున్న ప్రతి ఒక్కరికీ ఇది మన కథే కదా అనిపిస్తుంది. ఇందులో హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరపరిచిన ప్రతి పాట అద్భుతంగా ఉంటుంది. ప్రతి ఒక్కరూ ఈ సినిమా కోసం మనసు పెట్టి పనిచేశారు." అన్నారు.




## 94 ఏళ్ల వయసులో సింగీతం మ్యాజిక్.. 'SSR 61' టైటిల్ కోసం కౌంట్‌డౌన్ స్టార్ట్!

భారతీయ చలనచిత్ర రంగానికి ఎన్నో అద్భుతమైన సినిమాలను అందించిన లెజెండరీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు గారు, 94 ఏళ్ల వయసులో కూడా తనలోని ప్రేక్షకులను అలరించేందుకు తాపత్రయపడుతున్నారు. ఆయన దర్శకత్వంలో రాబోతున్న తాజా చిత్రం 'SSR61'. ఒక మేధావి దర్శకుడు, మరో అద్భుతమైన సృజనాత్మక దర్శకుడు నాగ్ అశ్విన్ నిర్మాణంలో ఈ సినిమా రూపొందుతుండటం సినీ వర్గాల్లోనే కాకుండా ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలను పెంచింది. వైజయంతి ఫిల్మ్స్ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. తాజాగా ఓ ఆసక్తికరమైన అప్‌డేట్‌ను చిత్రబృందం ఇచ్చింది. ఒక చెట్టు కొత్తగా ఆకులు చిగురిస్తున్న అందమైన పోస్టర్‌ను షేర్ చేస్తూ, "40 ఏళ్లుగా వేచి ఉన్న ఒక కథ... ఇంతకు ముందెన్నడూ మీరు చూడనిది" అని క్యాప్షన్ ఇచ్చారు. దీనితో ఈ సినిమా నేపథ్యం ఏదైనా ఉంటుందా? అసలు ఆ 40 ఏళ్ల కథేంటి? అని నెటిజన్లు రకరకాలుగా ఊహించుకుంటున్నారు. దీనికి తోడు సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండటంతో, విజువల్స్‌తో పాటు మ్యూజిక్ పరంగా కూడా ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచడం ఖాయమనిపిస్తోంది.

సినిమాపై ఉన్న ఆసక్తిని మరింత పెంచుతూ, మేకర్స్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మే 1వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్‌ను అధికారికంగా విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. గతంలోనే 'తమ గౌరి తనే' అంటూ ఒక అమ్మాయి లంగా ఓణీలో ఉన్న పోస్టర్‌తో ప్రేక్షకులకు ఒక చిన్న ట్విస్ట్ ఇచ్చిన టీమ్, ఇప్పుడు టైటిల్ రివీల్ కోసం రంగం సిద్ధం చేసింది. సింగీతం శ్రీనివాసరావు గారి మార్కు వినూత్న కథాంశం, నాగ్ అశ్విన్ నిర్మాణ విలువలు తోడైతే ఈ సినిమా మరో కళాఖండంగా మారుతుందని సినీ అభిమానులు భావిస్తున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ పోస్టర్ తెగ వైరల్ అవుతోంది. "వావ్.. సూపర్ ఎగ్జైటెడ్!", "లెజెండరీ కాంబినేషన్ కోసం వేచి చూస్తున్నాం" అంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. 94 ఏళ్ల వయసులో కూడా ఇంత ఉత్సాహంతో సింగీతం శ్రీనివాసరావు గారు ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడం నిజంగా గొప్ప విషయమని అందరూ కొనియాడుతున్నారు.



## నా రెండో పెళ్లి విషయంలో తన తప్పు లేదు..

అక్కినేని నాగచైతన్య, సమంత విడిపోయిన తర్వాత తమ వ్యక్తిగత జీవితాల్లో కొత్త ప్రయాణాన్ని మొదలుపెట్టిన సంగతి తెలిసిందే. నాగచైతన్య నటి శోభిత ధూళిపాళ్లను ప్రేమించి పెళ్లి చేసుకోగా... సమంత గత ఏడాది డిసెంబర్ 1న దర్శకుడు రాజ్ నిడిమోరును ఈషా ఫౌండేషన్‌లో రహస్యంగా వివాహం చేసుకుంది. అయితే నాగచైతన్యతో పెళ్లి సమయంలో శోభితపై చాలా నెగిటివిటీ వచ్చిన విషయం తెలిసిందే. తాను సమంత జీవితాన్ని నాశనం చేసిందని దారుణమైన ట్రోలింగ్ జరిగింది. ఇప్పటికీ సమంత అభిమానులు శోభితను ఏదో రకంగా తిడుతూనే ఉన్నారు. ఇక వాటిపై నాగచైతన్య ఇప్పటికే ఎన్నోసార్లు స్పందించగా.. ఇప్పుడు మరోసారి తన బాధను వ్యక్తపరిచాడు. తాజాగా, సోషల్ మీడియాలో శోభితపై వస్తున్న విమర్శలు, నెగెటివిటీపై నాగచైతన్య స్పందిస్తూ ఆవేదన వ్యక్తం చేశాడు. తమ బంధం గురించి నాగచైతన్య మాట్లాడుతూ.. శోభితను అన్యాయంగా విమర్శించడం పట్ల చాలా బాధగా ఉందని తెలిపాడు.

తన రెండో పెళ్లి విషయంలో ఆమెను నిందించడం సరికాదని, ఇందులో ఆమె తప్పు ఏమీ లేదని ఆయన స్పష్టం చేశాడు. "శోభిత పట్ల నాకు చాలా జాలిగా ఉంది. తను ఏ తప్పూ చేయకపోయినా, నెటిజన్లు తనపై అన్యాయంగా నెగెటివిటీని పెంచారు. ఆ సమయంలో తను పడిన బాధను చూసి నేను కూడా చాలా వేదనకు గురయ్యాను" అని చైతన్య పేర్కొన్నాడు. తమ మధ్య చిగురించిన ప్రేమ గురించి వివరిస్తూ.. తాము మొదట ఇన్‌స్టాగ్రామ్ ద్వారా కలుసుకున్నట్లు చైతన్య వెల్లడించారు. కాలక్రమేణా ఒకరినొకరు అర్థం చేసుకుని, తమ బంధాన్ని పెద్దల అంగీకారంతో పెళ్లి వరకు తీసుకెళ్లామని చెప్పారు. ఎంతో పారదర్శకంగా తమ జీవితాన్ని ముందుకు తీసుకెళ్తున్నా, బయట వ్యక్తులు చేస్తున్న కామెంట్లు తనను ఎంతగానో బాధించాయని ఆయన అన్నారు. మొత్తానికి, అటు సమంత, ఇటు నాగచైతన్య ఇద్దరూ గత చేదు జ్ఞాపకాలను విడిచిపెట్టి, తమకు నచ్చిన భాగస్వాములతో సంతోషంగా గడుపుతున్నారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను పక్కన పెట్టి, ఎవరి జీవితాల్లో వారు బిజీ అయిపోయారు.



## టాక్సిక్ డీల్.. నిర్మాతలకు ముచ్చెమటలు పట్టిస్తున్న OTTలు!

పాన్ ఇండియా స్టార్ యశ్ తదుపరి చిత్రం 'టాక్సిక్' చుట్టూ ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. భారీ బడ్జెట్, భారీ అంచనాలతో రూపొందుతున్న ఈ సినిమా ఇప్పుడు ఒక చిక్కుముడిలో పడింది. అదే 'డిజిటల్ హక్కుల' వ్యవహారం. ప్రస్తుతం OTT సంస్థల వైఖరి చూస్తుంటే, సినిమాను సకాలంలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం మేకర్స్‌కు పెద్ద సవాల్‌గా మారినట్లు కనిపిస్తోంది. ఫిల్మ్ నగర్ సమాచారం ప్రకారం, 'టాక్సిక్' డిజిటల్ హక్కుల కోసం ప్రముఖ OTT సంస్థలు కేవలం 100 కోట్లను మాత్రమే ఆఫర్ చేస్తున్నాయి. అయితే, సినిమా బడ్జెట్, యశ్ క్రేజ్‌ను దృష్టిలో ఉంచుకుని నిర్మాతలు ₹300 కోట్లు డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ భారీ వ్యత్యాసం కారణంగానే ప్రస్తుతం చర్చలు ప్రతిష్టంభనలో పడ్డాయి. గతంలో 'కేజీఎఫ్' సాధించిన విజయాన్ని ప్రాతిపదికగా తీసుకుని నిర్మాతలు లెక్కలు వేస్తుండగా, ప్లాట్‌ఫారమ్‌లు మాత్రం ప్రస్తుత మార్కెట్ పరిస్థితులను చూపిస్తూ వెనకడుగు వేస్తున్నాయి.

ఈ ఒప్పందం కుదరకపోవడానికి కేవలం ధర మాత్రమే కాకుండా, OTT సంస్థలు విధిస్తున్న కఠినమైన నిబంధనలు కూడా ఒక ప్రధాన కారణమని సమాచారం. ముఖ్యంగా, కేవలం ₹25 కోట్లను మాత్రమే బేస్ ప్రైస్‌గా ఆఫర్ చేయడం చిత్ర బృందాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది. అంటే, 25 కోట్లను ముందుగా ఇచ్చి, మిగిలిన బ్యాలెన్స్ మొత్తాన్ని సినిమా వ్యూస్‌ను బట్టి ఇస్తామని సంస్థలు మెలిక పెడుతున్నాయి. దీనివల్ల పెట్టిన పెట్టుబడి వెనక్కి వస్తుందో లేదో అన్న ఆందోళన నిర్మాతల్లో మొదలైంది. వాస్తవానికి ఈ సినిమా ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధం కావాల్సి ఉంది. కానీ, డిజిటల్ డీల్ ఇంకా ఓ కొలిక్కి రాకపోవడంతో సినిమాను వాయిదా వేసినట్లు ప్రచారం జరుగుతోంది. సాధారణంగా భారీ చిత్రాలకు విడుదల ముందే డిజిటల్ మరియు శాటిలైట్ హక్కుల ద్వారా వచ్చే ఆదాయం చాలా ముఖ్యం. ఇప్పుడు ఆ ఆదాయం విషయంలో స్పష్టత లేకపోవడంతో, నిర్మాతలు రిస్క్ తీసుకోలేక షూటింగ్ మరియు రిలీజ్ షెడ్యూల్స్‌ను రీఅడ్జస్ట్ చేస్తున్నట్లు సమాచారం.



## అప్పుడు నాకు బ్రెయిన్ సరిగ్గా పనిచేయలేదు..

జాతిరత్నాలు' సినిమాలో 'చిట్టి' పాత్రతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న పొడుగుకాళ్ల సుందరి ఫరియా అబ్దుల్లా. మొదటి సినిమాతోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న ఈ అమ్మడు, తనదైన నటన, చలాకీతనంతో యూత్‌లో మంచి క్రేజ్ సంపాదించుకుంది. ప్రస్తుతం ఆమె 'గాయపడ్డ సింహం' మూవీతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా మే 1న గ్రాండ్‌గా విడుదల కాబోతున్న నేపథ్యంలో, ఫరియా వరుస ప్రమోషన్లతో బిజీగా గడుపుతోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఫరియా తన కెరీర్‌కు సంబంధించి ఒక షాకింగ్ విషయాన్ని వెల్లడించి అందరినీ ఆశ్చర్యపరిచింది. తన కెరీర్‌లో ఇప్పటికీ బాధపడే విషయం ఏదైనా ఉందంటే అది 'హనుమాన్' సినిమా ఆఫర్‌ను రిజెక్ట్ చేయడమేనని ఫరియా ఓపెన్ అయింది. "నేను హనుమాన్ సినిమా ఆఫర్ వస్తే కాదన్నాను. అది నా జీవితంలో చేసిన అతి పెద్ద తప్పు. అప్పుడు నాకు బ్రెయిన్ సరిగ్గా పనిచేయలేదు, ఆలోచించే శక్తి లేక నో చెప్పాను" అని తనను తానే తిట్టుకుంది. అప్పటికే 'జాతిరత్నాలు' భారీ విజయం సాధించడంతో, తదుపరి పాత్రల ఎంపికలో అతిగా ఆలోచించి పొరపాటు చేశానని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో వచ్చిన 'హనుమాన్' బాక్సాఫీస్ వద్ద ఎన్ని సంచలనాలు సృష్టించిందో అందరికీ తెలిసిందే. ఆ సినిమాలో హీరోయిన్ పాత్రకు ఉన్న ప్రాముఖ్యతను తాను అప్పట్లో సరిగ్గా అంచనా వేయలేకపోయానని ఫరియా తెలిపింది. "నేను కొత్తగా ఇండస్ట్రీకి రావడం వల్ల అప్పట్లో అంత మెచ్యూరిటీ లేదు. పాత్ర గొప్పతనాన్ని తెలుసుకోలేకపోయాను. ఇప్పటికీ దర్శకుడు ప్రశాంత్ వర్మ లేదా హీరో తేజ సజ్జ కలిసినప్పుడు.. అంత మంచి సినిమాను మిస్ చేసుకున్నందుకు చాలా బాధగా ఉందని చెబుతుంటాను" అని తన మనసులో మాట బయటపెట్టింది. ప్రస్తుతం ఫరియా ఆశలన్నీ 'గాయపడ్డ సింహం' సినిమాపైనే ఉన్నాయి. ఈ చిత్రంలో ఆమె ఒక పవర్‌ఫుల్ పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం. తన కెరీర్‌లో చేసిన పొరపాట్ల నుంచి పాఠాలు నేర్చుకున్నానని, ఇకపై స్క్రిప్ట్ ఎంపికలో చాలా జాగ్రత్తగా ఉంటానని ఆమె స్పష్టం చేసింది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502036. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502036,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2007/18184, CELL : 8008609999